# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

**2. రాష్ట్రంలోని అనంతపురంలో జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

**3. ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**4. రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులను అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.**

**5. తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఈరోజు.**

==========================

నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నేపాల్ లో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఆ దేశం నుండి తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, నేపాల్ లో ఇప్పటివరకు 215 మంది తెలుగువారు ఉన్నట్లు సమాచారం ఉందని, వారందరిని తీసుకువచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తెలుగువారిని వివిధ మార్గాల ద్వారా సంప్రదించి.. కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని మంత్రి సూచించారు.

-------------------------

రాష్ట్రంలోని అనంతపురంలో జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, బిజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఇతర కూటమి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

-------------------------

ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వైద్య ఆరోగ్యశాఖ కేటాయించిన అంబులెన్సులను ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్... 31 సెకన్లు

-------------------------

పంచాయతీ ఎన్నికల్లో ఆధునిక ఎస్–3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు –ఈవీఎం వినియోగించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ –ఎస్ఈసీ నీలం సాహ్ని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు ఈవీఎంల సమీకరణపై రాష్ట్ర పంచాయతీరాజ్, పురపాలక శాఖల కమిషనర్లతో నిన్న సమావేశం నిర్వహించారు. అనంతరం నీలంసాహ్ని పాత్రికేయులతో మాట్లాడారు. ఎస్–3 ఈవీఎంల ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసుకునేలా సాఫ్ట్‌వేర్ సిద్ధం చేశామని తెలిపారు.

-------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీని తగ్గించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శ్రీసత్య సాయి జిల్లాకు చెందిన రైతు గంగాధర్ ఆకాశవాణికి తెలియజేస్తూ....

..వాయిస్... 18 సెకన్లు

-------------------------

కృష్ణాజిల్లాలో కీలకమైన మచిలీపట్నం – రేపల్లె రైల్వే నూతన లైను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వి. బాలశౌరి కోరారు. ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌తో ఆయన నిన్న సమావేశమైయ్యారు. మచిలీపట్నం – రేపల్లె రైల్వే లైను ఏర్పాటుపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మార్గం ఏర్పాటు వలన కోల్ కతా నుండి చెన్నై వెళ్ళే రైళ్ళు విజయవాడ జంక్షన్ మీదుగా వెళ్ళకుండా, మచిలీపట్నం మీదుగా వెళ్ళడానికి అవకాశం కలుగుతుందని, తద్వారా 70 కిలో మీటర్ల మేర దూరం తగ్గుతుందని చెప్పారు.

-------------------------

రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులను అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్...35 సెకన్లు

-------------------------

తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఈరోజు. 1895వ సంవత్సరంలో సెప్టెంబరు 10న, కృష్ణాజిల్లా నందమూరు గ్రామంలో ఆయన జన్మించారు. తెలుగు సాహిత్యంలో వేయిపడగలు వంటి గొప్ప రచనలు చేసిన విశ్వనాథ సత్యనారాయణ శ్రీమద్ రామాయణ

కల్ప వృక్షం రచనకు గాను జ్ఞానపీఠ్ అందుకున్న తొలి తెలుగు రచయితగా నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఆస్థాన కవిగా సేవలందించడంతో పాటు కళాప్రపూర్ణ, పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలతో ఆంధ్ర సాహిత్యానికి విశేష సేవలు చేసిన విశ్వనాథ సత్యనారాయణ 1976 అక్టోబర్ 18వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా సమగ్ర వ్యూహం–హెచ్ఐవి/ఎయిడ్స్ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన “5కె రెడ్ రన్” కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని మచిలీపట్నం తపాలా డివిజన్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో తపాలా సేవలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తపాలా శాఖ ద్వారా ప్రజలకు అతి తక్కువ ప్రీమియంతో బీమాలను అందిస్తున్నామని చెప్పారు. తపాలా శాఖ ఆన్‌లైన్ విధానం ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్– ఐపిపిబి ఖాతాలను సులభంగా తెరుచుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న దక్షిణ ఒడిషా, ఉత్తర కోసాంధ్రాల మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..28 సెకన్లు

======================